

పేదల రాజసం
వైఎస్సార్.. ఈ పేరు అభివృద్ధి.. సంక్షేమానికి చిరునామా.. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రగతికి ఆయన సేవలు చిరస్మరణీయం. - 8లో



పోటెత్తిన అర్జీలు
ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు పోటెత్తాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అర్జీలు స్వీకరించారు. - 8లో



చెర్లోపల్లెలో కేంద్రబృందం
తవణంపల్లె మండలం చెర్లోపల్లెలో కేంద్రబృందం సభ్యులు పర్యటించారు. పారిశుద్ధ్యం తదితర అంశాలు పరిశీలించారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అనుబంధ విభాగంలో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా రైతు విభాగం కమిటీ ఉపాధ్యక్షులుగా వెంకటరమణరాజు(నగరి), రాఘవరెడ్డి (పుంగనూరు), సోమరెడ్డి (కుప్పం), ప్రధాన కార్యదర్శులుగా బాలసుబ్రమణ్యం(తిరుపతి), సురేంద్రరెడ్డి (జీడీనెల్లూరు), వాయలా మనోహర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), నీలరాజ్ (చిత్తూరు), నాగిరెడ్డి(పుంగనూరు), సుధీర్‌రెడ్డి (నగరి), పురుషోత్తంరెడ్డి (కుప్పం), సంతానరాజు (కుప్పం), మాధవ్‌నాయుడు(చంద్రగిరి), వేణుగోపాల్‌రెడ్డి (చంద్రగిరి), కార్యదర్శులుగా సుబ్రమణ్యంరెడ్డి (చంద్రగిరి), పెరుమాళ్ బుజ్జిరెడ్డి(తిరుపతి), సుబ్రమణ్యం (జీడీనెల్లూరు), రవియాదవ్ (చిత్తూరు), శంకరప్ప(పలమనేరు), ఏలుమలైరెడ్డి (నగరి), ప్రమోద్‌రెడ్డి(పుంగనూరు), ఎర్రంరెడ్డి (పుంగనూరు), ఈసీ మెంబర్లుగా నరసింహులు(నగరి), మనోహర్ (జీడీనెల్లూరు), నోబెల్‌కుమార్ (చిత్తూరు), రమేష్ (పలమనేరు), మధురాజు(నగరి), సుబ్రమణ్యంరెడ్డి (నగరి), బాబురెడ్డి (నగరి), రెడ్డెప్ప (చంద్రగిరి), రామ్మూర్తి(చంద్రగిరి), గురుస్వామిరెడ్డి(చంద్రగిరి), జయచంద్రనాయుడు (సత్యవేడు), చంగరాయరెడ్డి (సత్యవేడు), దేవరాజు(సత్యవేడు), వెంకటకృష్ణరెడ్డి (శ్రీకాళహస్తి), దామోదర్‌రెడ్డి(శ్రీకాళహస్తి)ని నియమించారు.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 25వ తేదీ (మంగళవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులకు సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లపై ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల పురుషులు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లోకానీ, 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జగన్ పర్యటనపై కుట్రలు

- చంద్రబాబు డైరెక్షన్‌లో మంత్రి నారా లోకేష్ సమక్షంలోనే పన్నాగం
- జగన్‌తో వాదనకు దిగాలంటూ టీడీపీ ఎమ్మెల్యేలకు ఆదేశాలు
- శాంతి భద్రతల సమస్య సృష్టించాలనే కుతంత్రం
- జగన్ పర్యటనకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే
- కూటమి నేతలపై మండిపడిన భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళేనికి ఈ నెల 9వ తేదీన వస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలను ఉసిగొలిపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి మండిపడ్డారు. తిరుపతి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు డైరెక్షన్‌లో మంత్రి నారా లోకేష్ సమక్షంలోనే టీడీపీ ఎమ్మెల్యేలు వైఎస్ జగన్‌ను అడ్డుకుని, శాంతిభద్రతల సమస్యలను సృష్టించాలనే అంశంపై సమాచాలోచనలు చేశారని వెల్లడించారు. మామిడి రైతుల పక్షాన నిలబడటాన్ని కూడా రాజకీయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్యేల కుట్రలను గమనించి, జిల్లా పోలీస్ అధికారులు వైఎస్ జగన్ పర్యటనకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇంకా ఆయనేమన్నారంటే...

వైఎస్ జగన్ మామిడి రైతులను పరామర్శించేందుకు వస్తున్నారని తెలిసినప్పటి నుంచి టీటీడీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకుంటామని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ సహా పలువురు బెదిరింపు ధోరణితో మాట్లాడారు. వైఎస్ జగన్ పర్యటనలో అలజడి, శాంతిభద్రతల సమస్య సృష్టించి తద్వారా లబ్ధి పొందాలనే కుట్ర చంద్రబాబు, నారా లోకేష్ కనుసన్నల్లోనే జరుగుతోంది.

జన సమీకరణ చేయడం లేదు

వైఎస్ జగన్ పర్యటన కోసం వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరూ జనసమీకరణ చేయడం లేదు. ఆయన ఎక్కడకు వెళ్లినా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన వెంట నడుస్తుంటారు. కానీ టీడీపీ ఎమ్మెల్యేలు నేరుగా ఆయన పర్యటనను అడ్డుకుని, ఆయనతో వాదనలకు దిగుతామని చేస్తున్న ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవాలని జిల్లా ఎస్పీని కోరుతున్నాం. వైఎస్ జగన్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంది. టీడీపీ ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు వైఎస్ జగన్ అక్కరలేదు, ఈ జిల్లాకు చెందిన పార్టీ నాయకుడు అయినా సరిపోతారు. చిత్తూరు జిల్లా నుంచి ఎన్నికై, సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రాంత

ఇది వైఎస్ జగన్‌పై
దాడిగానే పరిగణిస్తాం

రైతులకు బాసటగా నిలిచేందుకు వస్తున్న మాజీ సీఎంపై టీడీపీ ఎమ్మెల్యేలను ఉసిగొల్పే ప్రయత్నం కూడా ఆయనపై దాడిగానే భావిస్తున్నాం. టీడీపీ ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించడానికి అనేక వేదికలు ఉన్నా కూడా నేరుగా వైఎస్ జగన్‌పై దాడి చేయడానికి సిద్ధమవుతుండడం దౌర్భాగ్యం. జిల్లాలో దాదాపు 1.05 లక్షల టన్నుల మామిడి పంట పల్ప్ ఫ్యాక్టరీలకు వెళితే, ఇంకా 1.70 లక్షల టన్నులు మామిడి కొనేవారు లేరు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా, వారికి అండగా నిలబడే వారిపైనే దాడికి పాల్పడతామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగుతున్నారు.

మామిడి రైతులను ఆదుకునేందుకు ఏ నాడు దృష్టి సారించకపోవడం వల్లే నేడు రైతులు ఈ దుస్థితిలో ఉన్నారు. మామిడిని కొనేవారు లేక, రోడ్ల మీద పోసి రైతులు వెళ్లిపోతున్నారు. అంతేకాకుండా ఈ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంటుందనే నమ్మకం లేక మామిడి తోటలనే నరికేసుకుంటున్నారు. ఇలా నరికేసుకుంటున్న రైతులపై అటవీశాఖ అధికారులను ఉసికొల్పి, తప్పుడు కేసులు నమోదు చేయడం, వేల రూపాయలు జరిమానాలు విధించడానికి ఈ ప్రభుత్వానికి మనసెలా వస్తోంది? వైఎస్ జగన్ ఈ జిల్లాకు వస్తున్నందున మామిడి రైతులు సంతోషంగానే ఉన్నారని చూపించడానికి ఇటువంటి నీచానికి పాల్పడతారా?.

వైఎస్ జగన్ హయాంలో కిలో రూ.22

'సీఎం పల్ప్ ఫ్యాక్టరీలతో సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకుంటున్నామని, వైఎస్ జగన్ హయాంలో మామిడి రైతులకు ఎటువంటి మేలు చేయలేదంటూ మాపైన ఆరోపణలు చేశారు. కానీ వైఎస్ జగన్ పాలనలో సగటున కిలో మామిడికి రూ.22 గిట్టుబాటు ధర కల్పించారు. ఆనాడు రైతులు ఎవరూ గిట్టుబాటు ధర లేదంటూ ఇప్పుడు చేస్తున్నట్లుగా ఆందోళనలు చేయడం, రోడ్ల మీదకి రావడం జరగలేదు. ఇప్పుడు చిత్తూరు జిల్లాలో జరుగుతున్న మామిడి రైతుల ఆందోళనలు, ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను చూసి, చలించిన వైఎస్ జగన్ ఒక బాధ్యత గల ప్రతిపక్ష నేతగా రైతులకు భరోసా కల్పించేందుకే బంగారుపాళ్యంకు వస్తున్నారు. ఆయన వస్తున్నారని తెలిసిన తరువాతే కిలోకు రూ.6 ఇస్తామంటూ రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఇస్తానంటున్న రూ.4కు సంబంధించి ఎటువంటి చెల్లింపుల జాడలేదు. కర్ణాటకలో 2.50 లక్షల టన్నుల మామిడిని కేజీ రూ.16 చొప్పున కొనుగోలు చేయించేందుకు కేంద్రప్రభుత్వం నుంచి హామీ పొందారు. కానీ ఇక్కడి సీఎం చంద్రబాబు కేంద్రానికి ఒక్క లేఖ కూడా రాయలేదు. దీనికి టీడీపీ ఎమ్మెల్యేలు ముందు సమాధానం చెప్పాలి.' అని భూమన కరుణాకర రెడ్డి డిమాండ్ చేశారు.

జగన్ అంటే అంత భయమెందుకో!

- సాధారణ జనాల్లోనూ జగన్ పర్యటనపై చర్చ
- వైఎస్ జగన్ రాక కోసం రైతుల ఎదురుచూపు
- కర్ణాటకలోనూ జోరుగా చర్చ



పలమనేరు: మామిడి రైతుల బాధలను చూసి వారికి అండగా నిలిచి, గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఈ నెల 9వ తేదీన జిల్లా లోని బంగారుపాళెం మామిడి మార్కెట్ వద్ద కు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా వాసులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటకు ప్రభుత్వం హెలీక్యాప్టర్‌కు అనుమతులివ్వకుండా ఆంక్షలు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఆయన రైతుల బాధల వినడానికి తాను బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బంగారుపాళేనికి వస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వాసులే కాదు పొరుగునే ఉన్న కర్ణాటకలోని హొసకోటె, కోలార్, ముళబాగిలు, నంగిళి ప్రాంతాల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం రోడ్డు మార్గంలో ఏపీ మాజీ సీఎం వస్తున్నాడని తెలిసి ఇప్పటికే భారీ సంఖ్యలో కర్ణాటక వాసులు రోడ్డు పక్కన బ్యానర్లకు ఆర్డర్ ఇచ్చేశారు. కర్ణాటకలోనూ స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు జిల్లా లోని పడమటి ప్రాంత రైతులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారుపాళెంలో హెలీప్యాడ్‌కు అనుమతులు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇంతకీ రైతు ల కష్టాల కోసం జగన్ వస్తే కూటమి ప్రభుత్వం ఎందుకు హడలిపోతుందనే ప్రశ్న తలెత్తుతోంది.

అనుమతి వెనుక ఇంత తతంగమా?

బెంగళూరు నుంచి బంగారుపాళెం వరకు దాదాపు 150 కిలోమీటర్లు జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గంలో వస్తే హైవేలో పెద్దసంఖ్యలో వాహనాలు, భారీ గా తరలివచ్చే జనంతో వైఎస్సార్ సీపీకి జాతీయ స్థాయిలో భారీ మైలేజీ వస్తుందని నిఘా వర్గాలు ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసినట్టు తెలిసింది. దీంతో హెలిప్యాడ్‌కు అనుమతిలిస్తేనే మేలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. చేసేది లేక అధికారులు హెలీప్యాడ్‌కు అనుమతులు ఇచ్చారనే మాట ఇప్పుడు జనం నోట నానుతోంది. ఏదేమైనా జగన్‌మోహన్‌రెడ్డి ఎలా వచ్చినా బంగారుపాళెం కార్యక్రమానికి వెళ్లేందుకు జనం సిద్ధంగా ఉండడం విశేషం.

వైఎస్. జగన్ పర్యటన రేపు

చిత్తూరు అర్బన్: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మామిడి రైతులు పడుతున్న కష్టాన్ని తెలుసుకోవడానికి బంగారుపాళెం మార్కెట్ యార్డులో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు.

- ఉదయం10 గంటలకు బెంగళూరు నుంచి హెలిక్యాప్టర్‌లో బంగారుపాళేనికి బయలుదేరుతారు.
- 10.50 గంటలకు బంగారుపాళెం మండలం కొత్తపల్లె హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 11 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 11.20 గంటలకు రోడ్డు మార్గంలో బంగారుపాళెం మార్కెట్ యార్డుకు చేరుకుంటారు.
- 11.20 నుంచి 12.20 గంటల వరకు మామిడి రైతుల కష్టాలపై బంగారుపాళెం మామిడి యార్డులో రైతులతో నేరుగా మాట్లాడుతారు.
- 12.20 గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి 12.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.45 గంటలకు బంగారుపాళెం కొత్తపల్లెలోని హెలిప్యాడ్ నుంచి బెంగళూరుకు బయలుదేరి, మధ్యాహ్నం 1.35 గంటలకు బెంగళూరుకు చేరుకుంటారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మెగా పీటీఎం 2.0 నిర్వహణపై ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పీటీఎం 2.0 ను ప్రైవేట్ విద్యాసంస్థల్లో తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 178 ప్రైవేట్ పాఠశాలల్లో పీటీఎం కార్యక్రమం నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ వరలక్ష్మి, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జన తరంగాన్ని ఎవరూ ఆపలేరు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: జప తరంగాన్ని ఎవరూ ఆపలేరని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు పర్యటన నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు విధించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డా.సునీల్ కుమార్ సోమవారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథి గృహంలో ఎస్పీ మణికంఠతో భేటీ అయ్యారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం కిలో మామిడికి కేంద్రం మెడలు వంచి రూ.16 చెల్లిస్తుంటే.. 20 మందికి పైగా ఎంపీలున్న ఏపీలోని కూటమి ప్రభుత్వం రూ.8 కూడా రైతులకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రైతుల కష్టాన్ని తెలుసుకోవడానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్నారు. ఆయన పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్తల నోటీసులను ఎస్పీ తమకు ఇచ్చారన్నారు. రైతులతో భేటీకి 500 మంది, హెలిప్యాడ్ వద్ద 30 మంది మాత్రమే వెళ్లాలని చెప్పారన్నారు. అయితే జననేతను చూడడానికి వచ్చే జనాన్ని ఆపడం ఎవరితరం సాధ్యం కాదన్నారు. జనం జగన్‌ను చూడడానికి వస్తారని, వాళ్ల అభిమానాన్ని తాము అదుపు చేయలేమని స్పష్టం చేశారు.

జగనన్న పర్యటన విజయవంతం చేయండి

- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): మామిడి రైతుల కష్టాలపై పోరాటం చేయడానికి బంగారుపాళేనికి వస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసి, మామిడి రైతుల పక్షాన నిలిచి, గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని పోరాటం చేయడానికి జగనన్న జిల్లాలో అడుగు పెడుతున్నారన్నారు. గతంలో కూడా పొగాకు, మిర్చి రైతుల పక్షాన పోరాటం చేసి, వారికి ఊరట కల్పించారని, అదే దిశలో జిల్లాల్లో మామిడి రైతుల కన్నీళ్లు తుడిచేందుకు ఈ నెల 9వ తేదీ బంగారుపాళేనికి వస్తున్నారని, ఆయన పర్యటనకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ముఖ్యంగా మామిడి రైతులు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం కనీస మద్దతు ధర టన్నుకు రూ.20 వేలు అందించి మామిడి రైతులను ఆదుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జగనన్న ప్రభుత్వంలో రైతులకు జరిగిన మేలును గుర్తు చేశారు. రైతన్నలకు ఎక్కడ అన్యాయం జరిగినా జగనన్న అక్కడ రైతుల పక్షాన పోరాటం చేసి, రైతుల పక్షపాతిగా నిలుస్తున్నారన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులకు ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సైబర్‌క్రైమ్, వేధింపులు, కుటుంబ తగదాలు, నగదు లావాదేవీలకు సంబంధించి 54 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని క్షుణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు.

మాట మాయం.. దోపిడీ ఖాయం



మామిడి రైతుల ఏడాది శ్రమ ఆవిరైంది. గిట్టుబాటు దక్కకుండా పోయింది. సాక్షాత్తు సీఎం చంద్రబాబు.. మంత్రులు మామిడి ధరపై ఇచ్చిన మాట మాయమైంది. ఫల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు తాము చెప్పిందే వేదంగా ఇష్టమొచ్చిన రీతిలో ధర నిర్ణయిస్తున్నాయి.. ఆ ధరకే ఇష్టపడి విక్రయిస్తున్నట్లు పుడమి పుత్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకుని, వారి శ్రమను దోపిడీ చేస్తున్నాయి. వెరసి కూటమి పెద్దల మామిడి మాట మాయం కాగా.. దోపిడీ ఖాయం అయ్యింది.

- తోతాపురి కిలో రూ.8కే కొంటారన్న సీఎం చంద్రబాబు
- జీడీనెల్లూరు ఫ్యాక్టరీలో రూ.6 విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి అంగీకారపత్రం
- పూతలపట్టులో రూ. 5 లెక్కన జమ
- పలు ఫ్యాక్టరీల్లో ధరలపై నోరు విప్పని ఫ్యాక్టరీ నిర్వాహకులు
- మామిడి రేట్లను కప్పి పుచ్చేందుకు కూటమి కుయుక్తులు
- మూగబోయిన మామిడి రైతులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి మాట మటాష్ అయింది. తోతాపురి కిలో రూ.8 మద్దతు ధర మాయమైంది. కొన్ని ఫ్యాక్టరీలు కిలో రూ.5, రూ.6 అని తేల్చాయి. మరికొన్ని ఫ్యాక్టరీలు ధరలను నొక్కిపెడుతున్నాయి. ముఖ్యమంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి మద్దతు ధర ఆదేశాలు ఆమడదూరంలో నిలిచాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనతో కూటమి ప్రభుత్వానికి వణుకు పుట్టుకుంది. మామిడి రేట్లను కప్పిపుచ్చేందుకు కుయుక్తులు పన్నుతోంది. దీంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు.

కొనుగోలిలా..

4,99,274 మెట్రిక్ టన్నుల దిగుబడి


జిల్లాలో 56 వేల హెక్టార్లల్లో మామిడి పంట పండుతోంది. ఇందులో తోతాపురి 39,895 హెక్టార్లకుగాను 4,99,274 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని ఉద్యానశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. జూన్ నెల ఆరంభం నుంచే కోతలు ప్రారంభమయ్యాయి. ఫ్యాక్టరీలు జూన్ 6వ తేదీ నుంచి ఫ్యాక్టరీలు కాయలు కొనుగోలు ప్రారంభించాయి. ర్యాంపులు జూన్ మూడో వారం నుంచి కొనుగోలుకు ముందుకు వచ్చాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 ఫ్యాక్టరీలుండగా 31 ఫ్యాక్టరీలు కాయలు కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు 38,706 మంది రైతుల నుంచి 2.22 లక్షల మెట్రిక్ టన్నుల కాయలను కొనుగోలు చేశాయి. ఇంకా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల కాయలు తోటల్లోనే ఉన్నాయి. మామిడి పోరుతో ఈసారి తోతాపురి కొనుగోలు మందగించాయి. దీంతో కాయలు చాలా వరకు రాలిపోతున్నాయి. రైతులు కూలీలకు కోత కూలి ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారు. ఫ్యాక్టరీలకు విక్రయించలేని పరిస్థితి నెలకొనిచ రైతులను నట్టేట ముసుగుతున్నారు.

ఇదీ మంత్రుల ధర...

మామిడి కోతలకు ముందు ఎదురైనా సమస్యల కారణంగా కూటమి ప్రభుత్వం తోతాపురి కిలో ధర రూ.8కు ఫ్యాక్టరీలు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం ప్రోత్సాహక నిధిగా కిలోకు రూ.4 చొప్పున్న అందిస్తుందని ప్రకటించింది. తీరా ఫ్యాక్టరీ రేటు అమలుకు నోచుకోలేదు. దీంతో రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి అచ్చెంనాయుడు గత నెలలో జిల్లాలో పర్యటించారు. గుడిపాల మండలం గొల్లమడుగులోని ఫ్యాక్టరీని తనిఖీ చేసి, తోతాపురి కిలో రూ.8కు కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు నగరం ఎంఎల్ఎస్ పాయింట్ ఆవరణలో జరిగిన రైతులు, ఫ్యాక్టరీల ముఖాముఖి కార్యక్రమంలో ప్రతి ఫ్యాక్టరీలోనూ కేజీ రూ.8కు కొంటారని తెలిపారు. తీరా ఆ ధరలు ఆ మరుసటి రోజు నుంచే అమలు కాలేదు. ఫ్యాక్టరీలు రూ.6, రూ.5 రూ.4 అంటూ పాట పాడాయి. తర్వాత ధరల విషయంలో ఫ్యాక్టరీలు నోరెత్తకుండా చాలించుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 3,4 తేదీల్లో కుప్పంలో పర్యటించిన సందర్భంగా మామిడి రైతులు, ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడారు. కచ్చితంగా తోతాపురి కేజీకి రూ.8కు ఇస్తారని గట్టిగా ప్రకటించారు. తీరా ఆ మాటలను కూడా ఫ్యాక్టరీలు లెక్క చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రూ.6కు అంగీకార పత్రం



రూ.6కే కాయలు కొనుగోలు చేస్తామని రెతుల నుంచి తీసుకుంటున్న అంగీకార పత్రం

కూటమి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనలేమని ఫ్యాక్టరీలు చేతులెత్తేస్తున్నాయి. అందుకు నిదర్శనమే జీడీనెల్లూరు మండలంలోని ఓ ఫ్యాక్టరీ ఇచ్చిన అంగీకార పత్రం నిదర్శనంగా నిలుస్తోంది. అందులో తోతాపురి కేజీ రూ.6కే విక్రయిస్తున్నామని రైతుల నుంచి సంతకాలు తీసుకుంటోంది. ఆ పత్రాలను కూడా బయటకు ఇవ్వకుండా, ఫొటోలు తీయనీకుండా అడ్డుకుంటోంది. అతి కష్టం మీద ఓ అంగీకార పత్రం బయటకు వచ్చింది. తద్వారా సూపర్‌సిక్స్ రేటు తెల్లతేటమైంది. ఇదీ కూడా ఒక మాయే నంటూ రైతులు పలువురు మండిపడుతున్నారు. పూతలపట్టులోని ఓ ఫ్యాక్టరీ రూ.5 చొప్పున్న చెల్లిస్తోందని, ఆ చెల్లింపులు బ్యాంకులో జమ అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తోతాపురి కేజీ రూ.8 చొప్పున్న ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రేటు చెబితే ఒట్టు..



దిగుబడిని సాకుచూపి మా పొట్టకొడుతున్నారు. ఎంతకు కొంటున్నారో చెప్పడం లేదు. మేము పండించిన పంటకు వారు చెప్పిందే ధరగా మారింది. ఈ పంట ఉన్నా ఒకటే.. లేకున్నా ఒకటే. కొన్ని ఫ్యాక్టరీలు రూ.5, రూ.6 అని చెబుతున్నాయి. 5 ఎకరాలో పంట పండింది. రూ.లక్షల్లో ఖర్చు చేశాను. ఆ కాయలను అమ్మితే చేతికి ఏం మిగలదు. ఫ్యాక్టరీల వద్దకు కాయలు తోలుకొస్తే సిఫార్సులతోనే గడిచిపోతోంది. –మురళి, యాదమరి మండలం

క్లుప్తంగా

ఏఎన్‌ఎంల బదిలీలకు సిఫార్సుల వెల్లువ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరిగే ఏఎన్‌ఎంల బదిలీలకు సిఫార్సులు పుట్టగొడుగులా పుట్టుకొచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 694 మంది జనరల్ బదిలీ, 51 మందికి మెడికల్ గ్రౌండ్స్ కింద బదిలీ కానున్నారు. ఈ నేపథ్యంలో ఏఎన్‌ఎంలు వారు అనుకూలమైన స్థలానికి బదిలీ కావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాల్లో వందలాది ఏఎన్‌ఎంలు సిఫార్సుల కోసం ఎమ్మెల్యేలు, కూటమిలో పలుకుబడి ఉన్న నేతల సిఫార్సు లేఖలు తెస్తున్నారు. దీంతో ఏ సిఫార్సుకు న్యాయం చేయాలో తెలియక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. దీనికితోడు కొంత మంది ఏఎన్‌ఎంలకు ప్రత్యేకంగా ఫోన్ చేసి సిఫార్సు చేస్తున్నారు. దీంతో అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. జూమ్ కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టారు. సోమవారం ఈ కౌన్సెలింగ్‌కు వాయిదా పడింది. ఈ బదిలీ జాబితాపై అధికారులు కుస్తీ పడుతుండడంతో మంగళవారం కూడా జరుగుతుందా ..లేదా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన వెంకటేష్

కుప్పం: పట్టణంలో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నా యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కుప్పం ప్రకాశం రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో ఎల్ఐసీలో పనిచేస్తున్న వెంకటేష్ అద్దెకు ఉంటున్నాడు. నెల్లూరు జిల్లాకు చెందిన వెంకటేష్ (29) ఎల్ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం స్నానం కోసం కరెంటు హీటర్ వేయబోయి షాక్‌కు గురై మృతి చెందాడు. నెల్లూరులోని మృతుడి బంధువులకు సమాచారం అందించడంతో వారి రాకకోసం ఎదురు చూస్తున్నారు.


భారీ స్థాయిలో వీఆర్వోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలను భారీ స్థాయిలో బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు గ్రేడ్ వన్ వీఆర్వోలు 28 మంది, గ్రేడ్- 2 వీఆర్వోలు 105 మందిని బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బదిలీ అయిన వీఆర్వోలు వెంటనే నూతన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పేదల రాజసం

- సంక్షేమ సంతకాలు
- తిరుపతిలో వర్సిటీ
- సత్యవేడులో శ్రీసిటీ
- నగరిలో పలు అభివృద్ధి పనులు
- నేడు వైఎస్సార్ జయంతి

వైఎస్సార్.. ఈ పేరు పేదలకు ఓ భరోసా.. అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా. కార్పొరేట్ వైద్యాన్ని పేదల దరిచేర్చిన ప్రాణదాత. విద్యార్థులకు విద్యాప్రదాతగా కీర్తి గడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను ప్రగతిబాట పట్టించి, సంక్షేమం అందించి పేదల హృదయాల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిన మహానేత పరిపాలనలో మానవత్వాన్ని జోడించి, నవయగానికి నాంది పలికిన వైఎస్సార్ పేదల మదిలో నిలిచిపోయారు. నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



చిత్తూరు కార్పొరేషన్: పేదల గుండెల్లో కొలువైన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాపకాలను ఇప్పటికీ ఉమ్మడి జిల్లా వాసులు నెమరువేసుకుంటూనే ఉన్నారు. రాజశేఖరరెడ్డి జిల్లాకు చేసిన మంచి, జనం హృదయాల్లో చెరగని ముద్ర వేసింది.

గాలేరు–నగరి సుజల స్రవంతికి శ్రీకారం

కరవు ప్రాంతమైన చిత్తూరు జిల్లాకు శ్రీశైలం జలాశయం నుంచి వరదజలాల్లో మిగులు నీటిని తరలించి సాగు, తాగు నీరు అందించడానికి గాలేరు–నగరి సుజల స్రవంతి పథకాన్ని 2005లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని 1,03,500 ఎకరాలకు సాగు నీరు అందించడానికి, ఈ జిల్లాలోని ప్రజలకు తాగు నీరు అందించడానికి ఈ పథకానికి రూపకల్పన చేశారు. 430 కిలోమీటర్లు సాగే ఈ ప్రాజెక్టు కాలువ 254వ కిలోమీటరు వద్ద అప్పటి ఉమ్మడి జిల్లాకు ప్రవేశించేలా ఏర్పాటు చేశారు. జిల్లాలో మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్, పద్మసాగర్, శ్రీనివాససాగర్, వేణుగోపాలసాగర్, వేపగుంట రిజర్వాయర్ మీదుగా నగరి రూరల్ మండలంలోని అడవికొత్తూరులో నిర్మించే రిజర్వాయర్‌కు చేరుకుంటుంది. మహానేత పాలనలో 70 శాతం పూర్తి అయిన ఈ ప్రాజెక్టు ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదు.


గాలేరు-నగరి కాలువ

ఈటీపీ ప్లాంటు

నూలుకు రంగువేసే ప్రక్రియలో వెలువడే రసాయన నీటి కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతుండడంతో కొన్నేళ్ల క్రితం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రాగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రతి డైయింగ్ యూనిట్‌కు ఈటీపీ అమర్చుకోవాలని లేకుంటే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. డైయింగ్ యూనిట్లు ఈటీపీ పెట్టుకోవాలంటే రూ.20 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంత ఖర్చుచేయలేని స్థితిలో వారు ఉండడంతో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రసాయన నీటిని శుభ్రపరిచే కామన్ ఈటీపీ ప్లాంటు ఏర్పాటుకు సంసిద్ధత తెలిపి, రూ. 14 కోట్ల మంజూరు చేశారు. ఆయన పాలనలో వేగంగా జరిగిన పనులు ఆయన మరణంతో మందగించింది. తర్వాత గతంలో ఎమ్మెల్యే రోజా ప్లాంటును ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు.

చిత్తూరులో రచ్చబండ పర్యటన పూర్తి కాక..

చిత్తూరులో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన వైఎస్సార్ ఇక్కడికి చేరుకోకనే పోయారు. ఆ రోజు ఉదయం 10.45 గంటలకు అనుప్పల్లెకు చేరుకోవాల్సి ఉంది. కానీ మార్గమధ్యలో 2009 సెప్టెంబర్ 2వ తేదీన హెలికాప్టర్ ప్రమాదంలో కర్నూలు నల్లమల అటవీ ప్రాంతంలో స్వర్గస్తులయ్యారు.

వంద పడకల ఆస్పత్రి..

మహానేత పాలనలో నగరికి రూ.15 కోట్ల వ్యయంతో వందపడకల ఆస్పత్రి మంజూరైంది. ఆధునిక హంగులతో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభమైన ఈ ఆస్పత్రి వైఎస్సార్ మరణానంతరం 60 పడకలకే పరిమితమైంది. గత పాలనలో ఆస్పత్రి అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

నగరి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి మున్సిపల్ పరిధి సత్రవాడ శివారుల్లో రూ.36 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జరిగింది. గాలేరు నగరి ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనుసంధానం చేశారు.

తిరుపతిలో..

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వైఎస్సార్ మానసపుత్రికగా నిలిచిపోయింది. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఏర్పాటుకు 2004 సెప్టెంబర్ 30వ తేదీన బీజం పడింది. అప్పటి సీఎం వైఎస్సార్ తిరుపతి వెటర్నరీ కళాశాల స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై కళాశాలకు యూనివర్సిటీ గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. 2005 జులై 15వ తేదీన వర్సిటీగా గుర్తింపు ఇచ్చారు. మొత్తం రూ.145 కోట్లు మౌలికవసతుల కల్పనకు కేటాయించారు. వర్సిటీ పరిధిలో తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి వెటర్నరీ కళాశాలలు తిరుపతిలో డెయిరీ టెక్నాలజీ కళాశాల, ముత్తుకూరులో మత్స్య కళాశాలలు ఉన్నాయి. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలు 30 ఉన్నాయి. వీటిలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులతో పాటు అనిమల్ హస్బెండరీల పాలిటెక్నిక్ కోర్సులు సైతం ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య 3 వేలకు పైగా చదువుతున్నారు. అధ్యాపకులు 305, బోధనేతర సిబ్బంది 2,545 మంది వరకు ఉన్నారు. అలాగే ప్రపంచలోనే పేరొందిన పుంగనూరు, ఒంగోలు జాతి పశు సంతతి అభివృద్ధికి పెద్ద ఎత్తున పరిశోధనలు చేస్తున్నారు.

శ్రీసిటీ రాకకు కారణం

2006లో అధికారికంగా శ్రీసిటీ సెజ్‌కు పచ్చజెండా ఊపి 2008 ఆగస్టు 8వ తేదీన 8 పరిశ్రమలకు అప్పట్లో సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. 8 పరిశ్రమలతో మొదలైన శ్రీసిటీ పారిశ్రామికవాడ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. దాదాపు రూ.60 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 27 దేశాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఆంధ్ర–తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని వెనుకబడిన ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గం 2004–2009 మధ్యలో అన్ని విధాలా అభివృద్ధి చెందింది. అప్పటి సత్యవేడు ఎమ్మెల్యే నారాయణస్వామి చొరవతో నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చేయూతనిచ్చారు. 2004లో వైఎస్సార్ రాజీవ్ పల్లెబాట పేరిట జిల్లాలోనే సత్యవేడు నియోజకవర్గంలో తొలిసారిగా పర్యటించిన ఆయన వరాల జల్లుతో ప్రాంతం అభివృద్ధికి నాంది పలికారు. సత్యవేడులో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఉబ్బలమడుగు, భువతేశ్వరకోన, రాళ్లవాగు నీటి ప్రాజెక్టుల ఏర్పాటు చేశారు. సత్యవేడుకు కలగా మిగిలిన డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, తొమ్మిది హైస్కూళ్లు, ఒక తమిళ మీడియం స్కూల్ ఏర్పాటు చేయడంతో ఇంటర్ తర్వాత ఉన్నత విద్యకు విద్యార్థులకు కష్టాలు తప్పాయి. దీంతో నియోజకవర్గంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మహానేతను విద్యాదాతగా ఇప్పటికీ స్మరించుకుంటున్నారు.

శ్రీకాళహస్తి పెద్దాస్పత్రిలో రక్తపాతం

- అధికార పార్టీకి చెందిన ఇరువర్గాల దాడులు
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఏ పార్టీకి సంబంధం లేదంటూ డీఎస్పీ ప్రకటన


శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో కర్రలతో దాడులకు తెగబడుతున్న యువకులు

సాక్షి టాస్క్ ఫోర్స్: అర్ధరాత్రి వేళ పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వర్గానికి చెందిన వారిపై, మరో వర్గం యువకులు దాడి చేయడంతో క్యాజువాలిటీ విభాగం రక్తంతో తడిచింది. ఏం జరుగుతోందో అర్థం కాక వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ భయానక ఘటన ఆదివారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి ఏరి యా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఏరియా ఆసుపత్రి సీసీ కెమెరాలో నమోదైన దాడి దృశ్యాలు సా మాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. శ్రీకాళహస్తిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని మంచినీళ్ల గుంట, వీఎం పల్లికి చెందిన యువకుల మధ్య ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. అగ్నిగుండ ప్రవేశం ముగిసిన అనంతరం అర్ధరాత్రి వేళ, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మంచినీళ్ళగుంట, వీఎంపల్లికి చెందిన యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మంచినీళ్లగుంటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మరికొంత మందిని వెంట తీసుకొచ్చిన వీఎం పల్లి యువకులు ఏరియా ఆస్పత్రి క్యాజువాలిటీ విభాగంలోకి చొరబడి చికిత్స పొందుతున్న యువకులు, వారి బంధువులపై కర్రలు, మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మంచినీళ్ల గుంటకు చెందిన వారు కూడా తిరగబడి రాళ్లు రువ్వడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ సమయంలో వీఎం పల్లికి చెందిన యువకుల ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. పెట్రోలు పోసి తగులబెట్టే ప్రయత్నంలో ఉండగా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే దాడులకు పాల్పడింది టీడీపీకి చెందిన యువకులు కావడంతో ఆస్పత్రి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ స్పందించడం లేదు. ఏం జరిగింది అనేది చెప్పడానికి కూడా ముందుకు రావడం లేదు.

పిల్లల భవిష్యత్తుతో ఆటలా..?

- పాఠశాలల విలీనంపై ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న పాచిగుంట వాసులు

యాదమరి: పసిపిల్లల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటోందని పాచిగుంట గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పెరుమాళ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంఈఓ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభం శుభం తెలియని చిన్న పిల్లలను స్థానిక పాఠశాలను విడిచి వేరే ప్రాంతంలో ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకోమనడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. తమ గ్రామంలోని పాఠశాలలోని 3,4,5 తరగతి విద్యార్థులు 26 మందిని పచ్చాపూరు, సిద్ధారెడ్డిపల్లి, కాశిరాళ్ల పాఠశాలలో విలీనం చేశారని చెప్పారు. ఈ మార్గంలో ప్రమాదకరమైన మలుపులు, బావులు, చెరువులున్నాయన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయం తీసుకోకుండా కూటమి ప్రభుత్వం ఇష్టానుసారం చిన్న పిల్లల భవితపై అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎంఈఓ రుక్మిణి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కుబేంద్రన్, వైస్ ప్రెసిడెంట్ కవిత, రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్య చెప్పుకునే హక్కు కూడా లేదా?


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు

- కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి చిత్తూరు జిల్లా అగ్రికల్చర్ అసిస్టెంట్ల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ బదిలీలు ఇటీవల నిర్వహించారు. ఈ బదిలీల్లో అన్యాయం జరిగిందంటూ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాలో చంటి పిల్లలతో పలువురు మహిళా సచివాలయ ఉద్యోగులు తమ ఆవేదనను కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు విచ్చేశారు. బదిలీల్లో చోటు చేసుకున్న అన్యాయాన్ని ఉన్నతాధికారులకు విన్నవించుకునేందుకు వస్తే దురుసుగా ప్రవర్తించడంతో సమస్యలు చెప్పుకునే హక్కు కూడా తమకు లేదా? అంటూ అగ్రికల్చర్ అసిస్టెంట్ ధర్నాలో ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు మాట్లాడుతూ ఇటీవల అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన బదిలీలు పూర్తిగా జీఓ నంబర్ 5కు విరుద్ధంగా చేపట్టారన్నారు. ఎలాంటి మెరిట్ లిస్ట్ ప్రదర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్య చెబితే నోరు మూసుకోమన్నారు!

తమకు జరిగిన ఆవేదనను చెప్పుకునేందుకు వెళితే సానుకూలంగా స్పందించాల్సిన చిత్తూరు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ నోరుమూసుకోమని చెప్పడం ఎంతవరకు న్యాయమని అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని అధికారులతో కాకుండా ఇంకెవరితో చెప్పుకోవాలని ప్రశ్నించారు. ర్యాంకులు, మెరిట్ ఉన్న వారికి ఎక్కడో దూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేల సిఫార్సులు, ముడుపులు ఇచ్చిన వారికి బదిలీల్లో న్యాయం చే శారని ఆరోపించారు. పలుకుబడి లేని, ముడుపులు ఇచ్చుకోని తమకు అన్యాయం చేశారని మండి ప డ్డారు. అనంతరం బదిలీల్లో జరిగిన అన్యాయంపై కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి విన్నవించుకు న్నారు. పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. త్రిశూల్, సెల్వం , భవ్య, పావని పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో కేంద్రబృందం పర్యటన

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె పంచాయతీలో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ–2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం అధికారులు హేమంత్, రాజేష్ చెర్లోపల్లెలో పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి, పొడి చెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును సందర్శించారు. కంపోస్టు ఎరువు తయారీ గురించి, మరుగుదొడ్ల వినియోగంపై విచారించి ఆరా తీశారు. కొన్ని కుటుంబసభ్యులను కలసి పారిశుద్ధ్యం, వృథానీటి వినియోగంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రార్థనా మందిరాల్లో మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం నిర్వహణపై సర్వే చేశారు. సర్పంచ్ సుధాకర్, ఎస్‌డబ్ల్యూఎం కన్సల్టెంట్ బాలసుందరం, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ మురుగేషన్ తదితరులు పాల్గొన్నారు. చెర్లోపల్లె పంచాయతీలో చేసిన సర్వే రిపోర్టును కేంద్రానికి నివేదిస్తామని కేంద్ర బృందం సభ్యులు తెలిపారు.

తమాషాలు చేస్తున్నారా....సరెండర్ చేస్తా

చిత్తూరు కలెక్టరేట్ : తమాషాలు చేస్తున్నారా....సరెండర్ చేస్తా అని జిల్లా కలెక్టర్ కొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఏమో ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటలకు ఖచ్చితంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరవుతారు. ఆయన వచ్చిన గంట తరువాత పలువురు జిల్లా అధికారులు హాజరుకావడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ విచ్చేసిన గంట తర్వాత హౌసింగ్ శాఖ ఈడీ గోపాల్ నాయక్ విచ్చేశారు. ఆయనతో పాటు మరో నలుగురు జిల్లా అధికారులు ఆలస్యంగా విచ్చేశారు. హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్ పై ఆగ్రహం వ్యక్తం చేసి బయటకు వెళ్లిపోవాలంటూ పీజీఆర్ఎస్ నుంచి పంపించేశారు. అలాగే డీఎం అండ్‌హెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్ అని పిలవగా వారిద్దరు సైతం పీజీఆర్ఎస్‌కు హాజరుకాని పరిస్థితి. దీంతో గైర్హాజరైన డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలిను సరెండర్ చేస్తానంటూ కలెక్టర్ మండిపడ్డారు.

పోటెత్తిన అర్జీలు

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వివిధ సమస్యలపై నమోదైన 332 అర్జీలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పోటెత్తిన అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పోటెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 332 అర్జీలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ వాసుదేవన్ వెల్లడించారు.

ఇళ్లను తొలగిస్తామంటున్నారు

తాము నివసిస్తున్న ఇళ్లను తొలగిస్తామంటున్నారు న్యాయం చేయాలంటూ పుంగనూరు మండలం మేలందొడ్డి పంచాయతీ గోపిశెట్టిపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర, శారదమ్మలు వాపోయారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో తమ సమస్యను విన్నవించుకున్నారు.

రేషన్‌షాపు తొలగించారు

ఎటువంటి ఫిర్యాదులు లేకున్నా తమ గ్రామంలోని రేషన్‌షాపును అన్యాయంగా తొలగించారని ఐరాల మండలం పుల్లూరు గ్రామానికి చెందిన దామోదర రెడ్డి, రంగయ్య తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ రేషన్‌షాపును తొలగించి పి.ఒడ్డుపల్లిలోని ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ చేస్తున్నారన్నారు. దీంతో రేషన్‌కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నట్లు తెలిపారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలి


వైద్యం వికటించేలా చికిత్స చేసిన ఆర్‌ఎంపీ వైద్యునిపై చర్యలు తీసుకోవాలని పలమనేరు మండలం కొలమాసనపల్లి వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల కల్పన అనే మహిళకు ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించిందన్నారు. దీంతో ఆమెకు ప్రస్తుతం మాటలు రావడం లేదని వాపోయారు. అమాయక ప్రజలకు వికటించే వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు జీతం చెల్లించాలి

జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 13 నెలల పెండింగ్ జీతం వెంటనే చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లి ఖాతాకు పంచాయతీ నిధులు

- పంచాయతీ కార్యదర్శి చేతివాటం
- నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి ఏప్రిల్ నెలలో షోకాజ్ జారీ
- సస్పెన్షన్ ఎత్తివేతకు ఓ కీలక నేత ప్రయత్నం?
- ఎట్టకేలకు అవినీతి తిమింగలాన్ని సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్


ఏప్రిల్ 23వ తేదీ డీపీఓ జారీచేసిన షోకాజ్

యాదమరి: మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ నిధులను తన తల్లి ఖాతాలో జమ చేసుకుని తన చేతి వాటం ప్రదర్శించాడు. జిల్లా పంచాయతీ అధికారి తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. దీంతో అతడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ తతంగం గడిచి, రెండు నెలల తరువాత జిల్లా కలెక్టర్ ఆ అవినీతి తిమింగలాన్ని శనివారం సస్పెండ్ చేశారు. వివరాలలోకి వెళితే.. యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడలో పంచాయతీ కార్యదర్శిగా ఎం.ప్రకాష్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. పంచాయతీలోని సాధారణ నిధుల నుంచి రూ.1,48,827 తన వ్యక్తిగత ఖాతాకు పలు దఫాలుగా మళ్లించుకున్నాడు. అంతటితో ఆగకుండా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.2,51,912 ఏకంగా తన తల్లి ఖాతాకు మళ్లించేశాడు. గత ఏప్రిల్ 17వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేయగా కార్యదర్శి అవినీతి బట్టబయలైంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయలేదు. ఈ అవినీతి అధికారి 2024 సంవత్సరం నుంచి గ్రామ పంచాయతీ సమావేశాల అజెండా రిజిస్టర్, హాజరు నమోదు, పన్నులు, ఇతర వివరాలను దస్త్రాలలో నమోదు చేయకుండానే విధి నిర్వహణలో పూర్తిగా అలసత్వం వహించాడు. నిధుల దుర్వినియోగంపై ఏడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని గత ఏప్రిల్ 23వ తేదీన కార్యదర్శికి షోకాజ్ జారీ చేశారు. అయితే ఈ వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా రాజకీయంగా ఓ కీలక వ్యక్తిని సంప్రదించి, సదరు ఆ ఉన్నతాధికారి వద్ద సెటిల్‌మెంట్ చేశారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి ప్రలోభాలు, ఒత్తిళ్లకు తలొగ్గని ఆ అధికారి తుది నివేదికలను జిల్లా కలెక్టర్‌కు నివేదించారు కలెక్టర్ పూర్వాపరాలను పరిశీలించి ఆ అవినీతి అధికారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ కావడానికి మూడు రోజుల ముందు 45 రోజులు సెలవు మంజూరు చేయించుకున్నాడు. దీంతో ఈ అవినీతి వ్యవహారంలో పలువురు ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు పంచాయతీ కార్యదర్శిగా ఎం.ప్రకాష్‌పై సస్పెన్షన్ ఎత్తివేతకు ఓ కీలక నేత ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.